పంటల బీమా.. లేదు ధీమా..!

- ప్రీమియం చెల్లింపుల నమోదు 15 శాతం లోపే
- రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- గత ప్రభుత్వంలో శతశాతం నమోదు


తాళ్లవలసలో పంటల బీమా నమోదు చేస్తున్న దృశ్యం

రణస్థలం:

కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమవ్వగా.. కుండపోత వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో పంటలు మునిగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన ప్రభుత్వం కనీసం రైతులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన శతశాతం ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. పంటల బీమాను రైతులే చెల్లించాలని అన్నదాతపై పెను భారం మోపింది. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటలకు రైతులు ప్రీమియం చెల్లిస్తేనే పంటల బీమా వర్తిస్తుందని కూటమి సర్కారు ఆదేశాలు జారీ చేసింది. అయితే బీమా ప్రీమియం చెల్లింపు గడువు పూర్తవుతున్నా ఎచ్చెర్ల నియోజకవర్గంలో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ప్రీమియం చెల్లింపు విషయంలో రైతులకు అధికారులు సక్రమంగా అవగాహన కల్పించకపోవడంతో ఇబ్బందులు తలెత్తినట్లు తెలుస్తోంది.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ప్రస్తుతానికి ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు, జి.సిగడాం, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లోని రైతుల పంటల బీమా ప్రీమియం చెల్లింపులు 15 శాతం మించలేదు. నియోజకవర్గంలో పెసర, మినుము వంటి పంటలు 1,500 ఎకరాల్లోపు ఉండగా, మొక్కజొన్న 42 వేల ఎకరాల్లో, వరి 35 వేల ఎకరాల్లో వేశారు. ఇంత భారీగా పంటలు వేసినా కనీసం 15 శాతం ప్రీమియం చెల్లింపులు జరగకపోవడంపై రైతులకు అవగాహన లోపమే కారణంగా తెలుస్తోంది. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో అలసత్వం వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివలన ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం జరిగితే పరిహారం కోల్పోయే ప్రమాదం ఉంది.

అవగాహన కల్పించాం

క్షేత్రస్థాయిలో మా సిబ్బందితో రైతులకు పంటల బీమాపై ప్రీమియం చెల్లించాలని అవగాహన కల్పించాం. అధిక శాతం రైతులు బ్యాంకు రుణాల రూపంలోనే చెల్లిస్తున్నారు. కౌలు రైతులతో పాటు కొంతమంది మాత్రమే బీమా స్వయంగా చెల్లించాల్సి ఉన్నా ఆసక్తి కనబర్చలేదు.

– వి.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రణస్థలం

గతంలో మాదిరిగా అమలు చేయాలి

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగానే ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంటల బీమాను అమలు చేయాలని రైతులంతా విజ్ఞప్తి చేస్తున్నాం. గత ప్రభుత్వంలో సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పూర్తిస్థాయి పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ సదుపాయం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోనున్నారు.

– గొర్లె అప్పలనాయుడు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, కొండములగాం గ్రామం

క్లుప్తంగా

ఐటీఐలో టైలరింగ్ కోర్సు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీలో మహిళలకు ప్రత్యేకంగా సూయింగ్ టెక్నాలజీ(టైలరింగ్) కోర్సు అందుబాటులో ఉందని శ్రీకాకుళం డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు బుధవారం తెలిపారు. కొన్ని సీట్లే మిగిలి ఉన్నాయని, మరిన్ని వివరాలకు 95051 61701, 99639 45259 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ప్రయాణికులు, మహిళలు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం డీపీటీవో అప్పలనారాయణ, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు తదితరులు ప్రయాణికులతో మాట్లాడారు. మహిళలకు ఉచిత ప్రయాణంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం ఎంపీరావు, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గార: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ సీహెచ్ గంగరాజు హెచ్చరించారు. మండలంలోని బోరవానిపేట పాఠశాలలో నారీశక్తి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటిని ఎదుర్కొనే విధానాలను తెలియజేశారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహస్ర కలశ మండపారాధన


సహస్ర కలశారాధనలు చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా సహస్ర కలశ మండపారాధనలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు గోపినంబాళ్ల వేంకట సీతారామాచార్యులు, నేతేటి మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ప్రధాన మండపారాధన, ఏకోత్తర సహస్ర స్నాపన మండప రచన, విశేష హోమాలు జరిగాయి. కార్యక్రమంలో రుత్వికులు చామర్తి జగన్నాథాచార్యులు, భోగారపు వెంకటరమణాచార్యులు, స్మార్తాగమ పండితులు లక్ష్మీధనుంజయశర్మ, ఆలయ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంట తులసీరావు, మహేష్ చంద్ర సామంత్, కోశాధికారి ఆర్‌వీఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జువాలజీ అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ యాళ్ల పోలినాయుడు రాసిన ఎసెన్షియల్ బయాలజీ పేరిట రూపొందించిన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు బుధవారం ఆవిష్కరించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు జీవశాస్త్రంలోని ప్రముఖమైన అంశాలపై ఈ పుస్తకంలో వివరణాత్మక విశ్లేషణ ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎసెన్షియల్ బయాలజీ బుక్ రచయిత డాక్టర్ పోలినాయుడు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం లెక్చరర్లు రవిబాబు, హారతి, డాక్టర్ జి.మణి, బయోటెక్నాలజీ డాక్టర్ రోణంకి హరిత పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: సముద్ర తీరం వెంబడి ఎవరైనా ఉగ్రవాదులు, ఇతర దేశాలకు చెందిన వ్యక్తులు వచ్చినప్పుడు తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరావు సూచించారు. మండలంలోని కొవ్వాడ గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సముద్ర తీరం వెంబడి నిషేధిత వస్తువులు అక్రమ రవాణా చేసినట్లు గుర్తించిన తక్షణమే 1093 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరు మార్చుకోవాలి


మాట్లాడుతున్న పీడీ సుధాకరరావు

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిసెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పనితీరు మార్చుకోకపోవడం దారుణమని ఉపాధి హామీ పథకం జిల్లా పీడీ బి.సుధాకరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 17వ విడత ప్రజావేదిక గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతి చెందిన వారి పేర్లతో మస్తర్లు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. పనులు చేసే ప్రాంతాలకు టెక్నికల్ అసిసెంట్లు వెళ్లకుండా మేట్లు ద్వారా కొలతను తీసి అప్‌లోడ్ చేస్తున్నారని మండిపడ్డారు. వేతనదారులు చేసిన పని కంటే వేతనాలు ఎక్కువ చెల్లింపు చేయడం సామాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, ఏపీడీ లోకేష్, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురిషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే పంట పొలాలు


రాఘవాపురం వద్ద ముంపులో ఉన్న పొలాలు

గార: వాయుగుండం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షంతో పాటు వంశధార ఛానెల్ నుంచి సాగునీరు రావడంతో తంపర పొలమంతా ముంపులోనే ఉంది. కొత్తూరు–సైరిగాం, రాఘవాపురం, సతివాడ ప్రాంతంలో సుమారు 250 ఎకరాల్లో రెండు రోజులుగా నీరు నిలిచిపోయింది. గత 20 రోజులుగా నీరు లేక అల్లాడిన వరి పంట ఇప్పుడు ముంపులో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

నాగరికతకు కేంద్ర బిందువు సిక్కోలు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ నాగరికతకు సిక్కోలు కేంద్ర బిందువని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. నగరంలోని గాంధీ మందిరంలో బుధవారం చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేరొందిన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు శ్రీకాకుళం జిల్లాలో ఉండడం గర్వకారణమన్నారు. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్లినా సిక్కోలు ప్రజలు సామాన్య కార్మికుడి నుంచి వివిధ రంగాల నిపుణుల వరకు ఉన్నారన్నారు. వారితో నటుకుల మోహన్, కొమ్ము రమణమూర్తి, కొంక్యాన వేణుగోపాల్, నక్క శంకరరావు ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో...

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అధికార సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం మాధవ్‌తో పాటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులకు అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇంజినీరింగ్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్ పరిశీలిస్తున్న వీసీ రజనీ తదితరులు

ఎచ్చెర్ల: బీఆర్ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రయోగశాలలను వీసీ కె.ఆర్.రజనీ బుధవారం ప్రారంభించారు. ఈ ప్రయోగశాలను సుమారు రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పవర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్స్, నెట్ వర్కింగ్ వంటి అంశాల్లో అధ్యయనానికి ఈ ప్రయోగశాల ఉపయోగపడనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, ఈఈఈ విభాగం కో–ఆర్డినేటర్ బి.భవానీ, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకుడు పి.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


పొన్నాడలో పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ గ్రామానికి చెందిన నేతింటి పోలివాడు కుమారుడు నేతింటి రాములు ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. అలాగే బడివానిపేట పంచాయతీ గిన్నివానిపేట గ్రామానికి చెందిన మైలపల్లి పాపారావు సోదరుడు ఇటీవల మరణించారు. దీంతో పాపారావు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జరుగుళ్ల శంకరరావు, సర్పంచ్‌లు నేతింటి యమున, కారి తాతారావు, ఎంపీటీసీ మజ్జి జగదీష్, లక్ష్మీ ప్రసాద్ మారుపల్లి నారాయణరాజు, నరసింహమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నడక యాతన..!

- అసంపూర్తిగా రోడ్ల నిర్మాణాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు


అసంపూర్తిగా ఉన్న టీడీవలస - నక్కపేట రహదారి

జి.సిగడాం: రోడ్ల నిర్మాణాలకు సంబంధించి పల్లె పండగ పేరుతో కూటమి నాయకులు ఎంతో హడావుడి చేశారు. తీరా చూస్తే పనుల ప్రారంభాలకు చూపిన శ్రద్ధ, పూర్తి చేయడంలో మరిచారు. దీంతో పనులు పూర్తవ్వక అసంపూర్తి రోడ్లపై ప్రయాణాలు చేయడం పక్కనబెడితే, కనీసం నడవడానికి కూడా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని నక్కపేట నుంచి టీడీవలస, సంతవురిటి నుంచి విజయరాంపురం, సీతారాంపురం నుంచి సంతవురిటి, రాజాం – చిలకపాలేం నుంచి సంతవురిటి వరకు బీటీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా.. నేటికీ పూర్తవ్వలేదు. అప్పట్లో వేసిన మెటల్ పూర్తిగా పైకి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్లను పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సంతవురిటి నుంచి విజయరాంపురం వెళ్లే రోడ్డు


సీతారాంపురం నుంచి సంతవురిటి వెళ్లే రోడ్డు

ఇబ్బందులు పడుతున్నాం



పల్లె పండగలో భాగంగా రహదారులు పూర్తి చేస్తామని హడావుడిగా పనులు ప్రారంభించారు. ఇప్పటికి నెలలు గడుస్తున్నా ఇంతవరకు రాళ్లు తేలి ఉండడమే తప్ప పనులు పూర్తి కాలేదు. ఈ రోడ్లపై ప్రయాణానికి నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తక్షణమే పనులు పూర్తి చేయాలి.

– బుడారి లక్ష్మణరావు, సర్పంచ్, సంతవురిటి

ప్రయాణం చేయడం కష్టం



సంతవురిటి నుంచి విజయరాంపురం గ్రామానికి వెళ్లడానికి సుమారుగా 3 కిల్లోమీటర్లు దూరం. మొత్తం రోడ్డంతా మెటల్ వేసి అర్ధాంతంగా పనులను నిలిపివేశారు. ఈ రాళ్ల మీద ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– వడిశ మహేశ్వరరావు, సర్పంచ్, దవళపేట

పంటల బీమా నమోదుకు గడువు పెంపు


మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: రైతుల పంటల బీమా నమోదుకు ఈ నెల 30 వరకు గడువు పెంచినట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం జాయింట్ మండల స్థాయి బ్యాంకర్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ కలిసి రుణాలు, డిపాజిట్లు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక చేర్పు సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్, మహిళలకు రుణాలు, పీఎం సూర్యఘర్ పథకం, కౌలు రైతు రుణాలపై చర్చించారు. సమావేశంలో నాబార్డు జిల్లా అధికారి రమేష్ కృష్ణ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్(బ్యాంక్ లింకేజి) నాగలక్ష్మి, డైరెక్టర్ రాంజీ, కన్వీనర్ ఈశ్వర్ గుప్తా, మండల వ్యవసాయాధికారి ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఆర్‌పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, కమ్మసిగడాం, వెల్బురాయి, దేవరపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలెం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జి.సిగడాం: స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏఈఈ పైడి దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాతువ, జి.సిగడాం, చెట్టుపొదిలాం, గొబ్బూరు, నిద్దాం, అధ్వాన్నంపేట, చంద్రయ్యపేట, మధుపాం, వెలగాడ, దేవరవలస ఎస్‌ఆర్‌పురం, నడిమివలస, ఎందువ, గెడ్డకంచరాం, జాడ, ఎందువపేట, జగన్నాథవలస, సేతుభీమవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఎచ్చెర్ల: మండలంలో గుజరాతీపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గుజరాతీపేట, తమ్మినాయుడుపేట, కేశవరావుపేట, కుశాలపురం, నవభారతి, ఫరీదుపేట, సనపలవానిపేట, ఇబ్రహీంబాద్, పూడివలస తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ యేగేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెండు లారీలు ఢీ


హైవేపై నిలిచిపోయిన వాహనాలు

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మధ్యాహ్నం 1 గంట సమయంలో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదం జాతీయ రహదారి మధ్యలో జరగడం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ వరకు వాహనాలు గంటపాటు నిలిచిపోయాయి. జే.ఆర్.పురం పోలీసులు వచ్చి లారీని క్రేన్ సాయంతో పక్కకు జరపడంతో రాకపోకలు కొనసాగాయి.

రోడ్డుకు గండి



శ్రీకాకుళం మండల పరిధిలోని నైరా గ్రామం నుంచి వెళ్లే రహదారి ఇటీవల పడిన వర్షాలకు గండి కొట్టేసింది. దీంతో ఈ రహదారి మీదుగా బట్టేరు, పొన్నాం, నవనంబాడు, గొల్లవానిపేట, గేదేలవానిపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో శ్రీకాకుళంలోకి రావాలంటే ఆమదాలవలస మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

– శ్రీకాకుళం రూరల్

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి


పాఠశాలకు బెంచీలు అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని దవళపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్‌లు కోరారు. బుధవారం దవళపేట ఎంపీపీ పాఠశాలకు సర్పంచ్ మహేశ్వరరావు సొంత నిధులతో విద్యార్థులకు అవసరమైన బెంచీలు, ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దవళపేట ఎంపీపీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఏ విద్యార్థిని అయినా చేర్పిస్తే తల్లిదండ్రులకు గ్రామం తరుపున రూ.5 వేలు బహుమతిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేశన్న, గ్రామ నాయకులు పేడాడ స్వాతినాయుడు, పేడాడ కృష్ణంరాజు, దుంపల రామ్మోనరావు, పేడాడ శ్యామలరావు, పేడాడ నారాయణరావు, అంగన్‌వాడీ కార్యకర్త పేడాడ పెద్ద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై దృష్టి సారించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరంలో శానిటేషన్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వార్డు సచివాలయాల ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ కార్యదర్శులు, కార్పొరేషన్ సిబ్బందితో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శానిటేషన్‌పై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి పైపులు పాడైతే తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు ముగ్గురూ సమన్వయంతో కార్పొరేషన్ లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ, రోడ్ల క్లీనింగ్, రోడ్డు పక్కన మట్టి పేరుకుపోతే దానిని తొలగించడం వంటి వాటిని చూడాలన్నారు. అక్టోబర్ 2న ఒక సచివాలయం అన్ని విధాలుగా శుభ్రత, తదితరమైన వాటిలో బాగుంటే ఉత్తమ వార్డు సచివాలయ అవార్డు ఉంటుందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.